క్లుప్తంగా

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు బాబురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి నైతిక విలువలు ఎంతో ముఖ్యమన్నారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, డివిజినల్ కన్వీనర్ నారాయణస్వామి, సీఆర్పీ హెచ్‌ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శకుంతల, శివప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పుంగనూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎన్‌ఎంయు అధ్యక్షుడు వేలు, కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేశారు. గురువారం డిపో ఎదుట ధర్నా చేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వినతి పత్రాన్ని డీఎం సుధాకరయ్యకు ఇచ్చారు. శంకరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కోనేటిరాయుని సేవలో నటి రమాప్రభ



ఆలయం వెలుపల రమాప్రభ

గంగవరం: కీలపట్ల కోనేటిరాయస్వామిని సినీ నటి రమాప్రభ గురువారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థమై కీలపట్లకు విచ్చేసిన ఆమెకు ఆలయ అర్చకులు స్వామివారి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పలమనేరుతో ఆమెకు అవినాభావ సంబంధాలు ఉన్నాయంటూ మీడియాతో చెప్పుకొచ్చారు. కోనేటిరాయస్వామిని దర్శించుకుని స్వామివారి కటాక్షం పొందేందుకు ఏటా ఇక్కడికి వస్తుంటానని అన్నారు.

రద్దీ ప్రాంతాల్లో స్కానర్



బస్టాండ్‌లో స్కానర్ ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ

సదుం: గంజాయిపై ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని, ఇందుకోసం ప్రతి మండలానికి ఒక క్యూఆర్ కోడ్‌ను అందజేసిందని ఎస్‌ఐ షేక్ షావలి గురువారం తెలిపారు. ఈ స్కానర్‌ను స్థానిక బస్టాండ్, బ్యాంకు, జనసంచారం ఉన్న ప్రదేశాల్లో ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. గంజాయిపై పోలీసుల దాడులు, అభిప్రాయాలను ప్రజలు ఇందులో తెలపవచ్చని సూచించారు.

శేషవాహనంపై అమ్మవారు



గుడుపల్లె: ప్రసన్న శ్రీరాళ్లగంగమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శేషవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నేడు శుక్రవారం ఆలయ ఆవరణలో అమ్మవారి పుష్పపల్లకీ సేవ ఉంటుందని అన్నారు.

దాసేగౌనూరు పంచాయతీలో అనుమతులు లేని లేఔట్లు



'బాబు' జమానా..

అక్రమ లేఔట్ల ఖజానా..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ లేఔట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పంచాయతీ, డీటీసీపీ అనుమతులు పొందకనే ఎకరాలకు ఎకరాల్లో లేఔట్లు వేసి పంచాయతీల ఆదాయానికి అక్రమార్కులు గండికొడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కూటమి నేతలు ప్రత్యక్షంగా, కొన్ని ప్రాంతాల్లో పరోక్షంగా అక్రమార్కులకు సహకరిస్తుండడంతో లేఔట్లకు చుట్టు పక్కల ఉన్న డీకేటీ భూములను దర్జాగా ఆక్రమిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కూటమి నేతలకు భయపడి వెనుకడుగు వేస్తున్నారు. దీంతో కుప్పంలో అక్రమ రియల్ వ్యాపారం మూడు వెంచర్లు–ఆరు లేఔట్లు అన్న చందాన సాగుతోంది.

- గ్రామీణ ప్రాంతాల్లో వెలుస్తున్న వైనం
- డీటీసీపీ అనుమతులు లేకనే ఏర్పాటు
- ఒక్కో పంచాయతీలో నాలుగైదు లేఔట్లు కూడా..!
- లేఔట్లకు మట్టి తరలింపుతో రూపురేఖలు కోల్పోతున్న చెరువులు
- కూటమి నేతల అండదండలతో జోరుగా వ్యాపారాలు
- నిద్రావస్థలో అధికార గణం
- ఇదీ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో రియల్ దందా

కుప్పం రూరల్: గత జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కుప్పం నియోజకవర్గంలో ఒక్కసారిగా కృత్రిమ రియల్ భూమ్ మొదలైంది. కూటమి నేతలు, వారి అనుచరులు అక్కడక్కడ గ్రామాల్లో భూములు కొనుగోలు చేసి లేఔట్లు వేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరదీశారు. భూముల యజమానులను నయానో భయానో లోబరుచుకుని భూముల కొనుగోలు చేసి, ఆ భూముల్లో ప్లాట్లు వేసి, రియల్టర్లుగా అవతారం ఎత్తుతున్నారు. అయితే ఎక్కడా ఒక్కటంటే ఒక్క లేఔట్‌కు పంచాయతీ, డీటీసీపీ అనుమతులు తీసుకోవడం లేదు. దీంతో పంచాయతీల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. గ్రామాలకు ఆనుకుని పది సెంట్ల భూమి ఉన్నా సైట్లు వేసి కూటమి నేతలు జేబులు నింపుకోవడమే పరమావధిగా ముందుకువెళ్తున్నారు. లేఔట్లకు ఆనుకుని ఏదైనా డీకేటీ భూమి ఉన్నా దానిని లేఔట్లలో కలుపుకుని భూకబ్జాలకు దిగుతున్నారు. లేఔట్లకు అనుమతులు లేవని తెలియక ఆ సైట్లు కొనుగోలు చేసినవారికి మాత్రం భవిష్యత్తులో బ్యాంకు లోన్లు, ఇతర పర్మిషన్లు రాక ఇబ్బందులు పడడం తథ్యం. ఇది తెలిసినా రియల్ వ్యాపారం పేరిట ప్రజలను మోసగిస్తున్నట్లేనని అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని అధికారులు

కుప్పం, ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో అధికారులు అక్రమ రియల్ వ్యాపారుల జోలికి వెళ్లడానికి సాహసించడం లేదు. అధికారుల తమ కళ్ల ముందే ఎలాంటి అనుమతులు లేకుండా ఎకరాలకు ఎకరాలు లేఔట్లు వేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక రియల్ వ్యాపారుల నుంచి ప్రతిఫలం పొందుతున్నారనే ఆరోపణలూ వస్తున్నాయి.

నిబంధనలు ఏమంటున్నాయంటే..!

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వేసే లేఔట్లపై రెండు జీఓలను రూపొందించింది. జీఓ ఎంఎస్ నంబర్ 67–2002లో లేఔట్ల నిబంధనలు, జీఓ ఎంఎస్ నంబర్ 12–2016లో రేట్లకు సంబంధించి నిబంధనలను విడుదల చేసింది. ఎవరైనా గ్రామీణ ప్రాంతాల్లో లేఔట్లు వేయాలంటే మ్యాప్‌తో కూడిన రికార్డులను గ్రామ పంచాయతీకి ఇవ్వాలి. వారు డీటీసీపీ (డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) ఆఫీసర్ టెక్నికల్ మ్యాప్ రూపొందిస్తారు. దీంతో పాటు పంచాయతీకి చెల్లించాల్సిన రుసుము అందులో పొందుపరుస్తారు. ఇవే కాకుండా లేఔట్ వేయాల్సిన స్థలంలో 10 శాతం నేలను గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన కూడా ఉంది. అక్రమార్కులు ఇవన్నీ తుంగలో తొక్కి ఎంచక్కా రియల్ వ్యాపారం చేస్తున్నారు.

ఒక్క దాసాగౌనూరులోను మూడు లేఔట్లు

నియోజకవర్గ కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలోని దాసేగౌనూరు పంచాయతీలోనే మూడు లేఔట్లు వెలిశాయి. ఈ మూడింటికీ ఎలాంటి అనుమతులూ లేవు. కానీ ఎకరాలకు ఎకరాల్లో లేఔట్లు వేయడం.. పైగా నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగించే కుప్పం–కంగుంది మార్గంలోనే ఇవి ఉండడం గమనార్హం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్రమ లేఔట్లపై సర్పంచ్ కన్నమ్మ ఇప్పటికే కుప్పం తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్లకు రాతపూర్వకంగా ఫిర్యాదు సైతం చేశారు.

చెరువులనూ చెరబట్టి..!

చెరువుల్లో చీమ చిటుక్కుమన్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇట్టే వచ్చి వాలిపోతారు. కానీ లేఔట్లకు రేయింబవళ్లనే తేడా లేకుండా భారీ యంత్రాలతో మట్టిని తరలిస్తున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. వీరప్పనాయునిచెరువు, కుప్పం, లక్ష్మీపురం వంటి చెరువుల్లో లేఔట్లకు మట్టి తరలించడంతో వాటి రూపురేఖలే కోల్పోయే పరిస్థితి దాపురించింది. వర్షాలు కురిసినా నీరు నిలువ ఉండే పరిస్థితి లేదు.



వీరప్పనాయుని చెరువులో లేఔట్లకు మట్టిని తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

నోటీస్ బోర్డు

10న లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో మే 10న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫాషేక్ తెలిపారు. గురువారం ఆమె విలేకరుల తో మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. ప్రజలు తమ కేసులను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని తెలిపారు. న్యాయవాదులు, అన్నిశాఖల అధికారులు లోక్‌అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి కృషిచేసి జయప్రదం చేయాలని కోరారు.

23న సదుం మండల మీట్

సదుం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిబాబు తెలిపారు. ఎంపీపీ మాధవి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. సమావేశంలో మండల అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై చర్చిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

గంజాయి విక్రయాలపై సమాచారం ఇవ్వాలి

బైరెడ్డిపల్లె: గంజాయి విక్రయాలపై సమాచారం ఇవ్వాలని బైరెడ్డిపల్లె ఎస్‌ఐ పరుశురాముడు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మకాలు, విక్రయాలు గానీ, పొలాల్లో పండిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు కూడలి, జెడ్పీ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో, ప్రధానమైన కూడళ్లలో స్కానర్లు ఏర్పాటు చేశామన్నారు. స్కానర్ల ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్టం



హాజరైన వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని టి.వడ్దూరు గ్రామంలో మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం జరిగిన దుర్యోధన వధ అలరించింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై అక్కడ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనకు గ్రామ పెద్దలతోపాటు రూరల్ మండల నేతలు స్వాగతం తెలిపారు. మండల కన్వీనర్ బాలాజీనాయుడు, సర్పంచ్ మునస్వామి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి క్లస్టర్‌లోని ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం గురువారం అక్కడి ప్రాథమిక పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి ఎంఈఓ లీలా రాణి హాజరై సాకేవూరు పాఠశాలకు చెందిన జయలక్ష్మి, కొలమాసనపల్లి ఎంపీపీ స్కూల్ టీచర్ త్రిలోక్‌లను దుశ్శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్, సీఆర్పీలు, పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పంప్‌హౌస్ వద్ద కొత్త బోరు డ్రిల్లింగ్

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి అధికారులు గురువారం చర్యలు తీసుకున్నారు. పట్టణ సమీపంలోని నాగమంగళం పంప్‌హౌస్ వద్ద ఎండిన బోర్లను డీపెనింగ్, కొత్త బోర్ల డ్రిల్లింగ్ కార్యక్రమాలను రూ.20లక్షలతో చేపట్టినట్టు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. దీంతోపాటు ఆరు ట్యాంకర్ల ద్వారా పట్టణంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థినులకు ఆరోగ్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

పలమనేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బాలల సమగ్ర ఆరోగ్య పథకంలో భాగంగా స్థానిక వైద్యసిబ్బంది గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థి బరువు, ఎత్తు, మానసిక పరిస్థితిపై ఆరా తీశారు. వీరికున్న సమస్యలను తెలుసుకొని చికిత్స కోసం రెఫరల్ సేవలను చేపట్టనున్నట్టు స్థానిక సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. ఇందులో హెల్త్ సూపర్‌వైజర్ ఉషాకుమారి, ఆరోగ్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ ప్రారంభం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కౌట్స్, గైడ్స్‌ను మండల విద్యాశాఖ అధికారులు సిద్ధరామయ్య, పోకల తాతయ్య ప్రారంభించినట్లు హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. పీఎంశ్రీ పాఠశాలలో చదివే బాలబాలికల కోసం ఏర్పాటు చేసిన స్కౌట్స్, గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సమాజసేవ కార్యక్రమాల్లో పాల్గొనడం, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, విద్యార్థులకు ప్రత్యేక డ్రెస్‌కోడ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. స్కౌట్స్, గైడ్స్ కెప్టెన్లు రాజశేఖర, విమల విక్టోరియా, వనపర్తి వెంకట సిద్ధులు, రాజేంద్ర పాల్గొన్నారు.



స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో ఎంఈఓలు, టీచర్లు

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీలు కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.3లక్షలలోపు రుణాలకు 60శాతం సబ్సిడీ, రూ.3లక్షలకుపైగా రుణాలకు 40శాతం సబ్సిడీ, రూ.10లక్షలదాకా రుణాలకు 40శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. వివరాలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం, సంబంధిత సచివాలయాలను సంప్రదించాలని అందులో సూచించారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సీఐ

పుంగనూరు: పుంగనూరు అర్బన్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బి.సుబ్బరాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న సీఐ ఇక్కడికి బదిలీపై వచ్చారు. కొత్త సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలు, ట్రాఫిక్‌ను పరిష్కరిస్తూ, ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు గత నెలలో సస్పెండ్ అయ్యారు. అప్పటి నుంచి రూరల్ సీఐ రాంభూపాల్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. నూతన సీఐను ఎస్‌ఐలు లోకేష్, వెంకటరమణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పలమనేరు: మండలంలోని క్యాటిల్‌ఫాం ఇమ్మాస్విస్ ఆస్పత్రి స్కూల్‌లో అగ్నిప్రమాదాలపై స్థానిక ఫైర్‌శాఖ అధికారులు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు, జరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇందులో స్థానిక ఫైర్ ఆఫీసర్ మనోహరన్, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగు పడి ఆవు మృతి



బైరెడ్డిపల్లె: మండలంలోని కడతట్లపల్లె సమీపంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పిడుగు పడి ఓ పాడి ఆవు మృతిచెందింది. కడతట్లపల్లెకు చెందిన రామచంద్రప్ప వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసుకున్న పాకలో పాడిఆవు కట్టి ఉంచాడు. గురువారం సాయంత్రం పిడుగుపాటుకు ఆవు మృతిచెందింది. పాడి ఆవుతో జీవనం సాగిస్తున్న రామచంద్రప్పను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈతకెళ్లే పిల్లలపై దృష్టి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

పుంగనూరు: ప్రస్తుత వేసవిలో ఈతకు వెళ్లే పిల్లలపై దృష్టిపెట్టాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌లో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వారోత్సవాలను ఈనెల 20 వరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రమాదాలు తీవ్రంగా ఉంటాయన్నారు. వీటిని నివారించేందుకు ప్రతిఒక్కరూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం అందించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



సుబ్బారెడ్డి కుమార్తె వివాహ వేడుకల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెడ్డెప్ప, వెంకటేగౌడ

పుంగనూరు: రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం రాత్రి పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నేత కోనేటి వెంకట్రమణ వివాహ కార్యక్రమానికి పెద్దిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లుసుబ్బారెడ్డి కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను పెద్దిరెడ్డి ఆశీర్వదించారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, మదనపల్లె కన్వీనర్ నిస్సార్ అహ్మద్, నేతలు నాగభూషణం, భాస్కర్‌రెడ్డి, జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్‌కు సన్మానం



ఢిల్లీప్రియను సత్కరిస్తున్న ప్రిన్సిపల్

శాంతిపురం: ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, అధ్యాపకులు సన్మానించారు. తులసినాయనపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుకున్న సి.ఢిల్లీప్రియ బైపీసీలో 977 మార్కులు సాధించింది. తన కృషికి గుర్తింపుగా గురువారం ఐటీఐకి పిలిపించి సత్కరించారు. ప్రిన్సిపల్ జి.నగేష్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కాలేజీలకు ఢిల్లీప్రియ టాపర్‌గా నిలిచిందన్నారు. తన తండ్రి రామచంద్రయ్య ఐటీఐలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారని చెప్పారు. ఎంఈఓ–2 తీగల వెంకటయ్య, ఐటీఐ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

వి.కోట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ముదరందొడ్డి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బాలచైతన్య అన్నారు. గురువారం మండలంలోని ముదరందొడ్డి పాఠశాల విద్యార్థులు రామకుప్పం మండలంలోని ననియాల ఎలిఫెంట్ క్యాంపులో రామకుప్పం మండలం, వి.కోట మండలానికి చెందిన 80 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌జీసీ డైరెక్టర్ స్రవంతి, జిల్లా విద్యాశాఖాధికారిణి వరలక్ష్మి ఆదేశాల మేరకు అటవీ అధికారుల సహకారంతో ఒక్కరోజు విద్యార్థులను ప్రకృతి ఒడిలో ఆటపాటలు, ప్రకృతి పరిశీలన, వినోదం, పర్యావరణ పరిరక్షణ, అడవుల ప్రాముఖ్యత, వాటి రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి క్యాంపుల ద్వారా విద్యార్థులకు ఎంతో అవగాహన కలుగుతుందని తెలిపారు.